

డోనీ మైఖేల్ బాధ్యతల స్వీకరణ

ఈస్టర్న్ కోస్‌గార్డ్ రీజియన్ కమాండర్‌గా ఇన్‌స్పెక్టర్ జనరల్ డోనీ మైఖేల్ మంగళ వారం బాధ్యతలు స్వీకరించారు. 8లో



క్రీడాభివృద్ధికి సీఎం జగన్ కృషి

రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 8లో



నెట్స్‌లో చెమటోడ్చారు 8లో

న్యూస్‌రీల్

బీఆర్‌టీఎస్ బాధితుల కోసం హెల్ప్ డెస్క్



బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఏసీపీ, సచివాలయ సిబ్బంది

సింహాచలం: అడవివరంలోని బీఆర్‌టీఎస్ బాధితుల కోసం స్థానిక ఇందిరా ప్రియదర్శినీ కల్యాణ మండపంలో మంగళవారం నుంచి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. తొలిపావంచ నుంచి పాత అడవివరం వరకు ఇటీవల రోడ్డుకు ఇరువైపులా ఉన్న నిర్మాణాలను తొలగించారు. ఈ నెల 20న జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ హామీ మేరకు బాధితుల సౌకర్యార్థం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఏసీపీ వెంకటేశ్వరరావు, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు సాహితి, మౌనిక బాధితుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. మొత్తం 10 మంది వినతిపత్రాలు సమర్పించారు. తమకు టీడీఆర్‌లు, నష్టపరిహారం ఇవ్వాలని, పేర్లు మార్చాలని వినతిపత్రాలు సమర్పించిన వారిలో ఉన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం రాజన్నదొర

ఎంవీపీ కాలనీ: స్థానిక ఉషోదయ కూడలిలోని పర్యవేక్షణ ఇంజినీరింగ్(గిరిజన సంక్షేమ శాఖ) కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని మంగళవారం రాష్ట్ర డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అద్భుతమైన ఇంజినీర్‌గా మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి అందించిన ఖ్యాతి వెలకట్టలేనిదన్నారు. బ్రిటీష్ పాలకులు సైతం ఆయన ప్రతిభను కొనియాడారంటే అర్థం చేసుకోవచ్చన్నారు. విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో యువత ఇంజినీరింగ్ రంగంలో అద్భుతాలు సృష్టించాలన్నారు. యువ ఇంజినీర్లు దేశానికి, సమాజానికి విలువైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాస్, గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు పీపీడీ పాత్రుడు, తదితరులు పాల్గొన్నారు.

28 స్కూల్ ఆటోలపై కేసులు



తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: నిబంధనలు ఉల్లంఘించిన 28 స్కూల్ ఆటోలపై రవాణా శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి మంగళవారం వరకు జిల్లాలో పలుచోట్ల తనిఖీలు నిర్వహించినట్లు ఉప రవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు. పరిమితికి మించి ఆటోల్లో విద్యార్థులను గానీ, ప్రయాణికులను గానీ తీసుకెళ్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఆటోలను కూడా సీజ్ చేస్తామన్నారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.


పలు ఆస్పత్రుల్లో పోస్టుల భర్తీ

మహారాణిపేట: జిల్లాలోని పలు ఆస్పత్రుల్లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ పోస్టులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేస్తున్నట్లు జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయ అధికారి డాక్టర్ రమేష్ కిషోర్ తెలిపారు. జనరల్ డ్యూటీ అటెండెంట్ మూడు పోస్టులు, పీఎం అసిస్టెంటు ఒక పోస్టు, ఆడియో మెట్రీషియన్ రెండు పోస్టులు, థియేటర్ అసిస్టెంట్ ఒక పోస్టు భర్తీ చేయనున్నట్లు తెలియజేశారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆ రోజు సాయంత్రం 5 గంటల లోపు పెందుర్తిలోని జిల్లా ఆస్పత్రుల సమన్వయ సేవల అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఇతర వివరాల కోసం www.visakhapatnam.ap.gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని కోరారు.

పద్మనాభంలో 'జగనన్నకు చెబుదాం' నేడు

మహారాణిపేట: పద్మనాభం మండలంలో బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అన్ని శాఖల విభాగాధిపతులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది కచ్చితంగా హాజరు కావాలని ఆదేశించారు.

సింహగిరికి మరో ఘాట్ రోడ్



దొండపర్తి : సింహాచలం భక్తులకు శుభవార్త. కొండపైకి మరో ఘాట్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రాకపోకలకు ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే రెండు ఘాట్లు అందుబాటులో ఉండగా మరో ఘాట్ రోడ్డు ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై అధికారులు కసరత్తు పూర్తిచేశారు. సింహాచలం దేవస్థానం పై నుంచి కిందకు దిగేందుకు వీలుగా మరో ఘాట్ రోడ్డును నిర్మించేందుకు యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. పర్వదినాల్లో భక్తుల రాకపోకలు, వాహనాల రద్దీని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఘాట్ రోడ్డు వేసేందుకు సింహాచలం దేవస్థానం అధికారులు రెండు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అలాగే తొలి పావంచ నుంచి కొండపైకి ప్రస్తుతం ఉన్న రహదారిని దశావతారం జంక్షన్ నుంచి 2.5 కిలోమీటర్ల మేర విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు వాటి సాధ్యాసాధ్యాలపై వివిధ విభాగాల అధికారులతో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ మంగళవారం వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న రహదారుల సామర్థ్యం, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని తీసుకోబోయే చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఆర్అండ్‌బీ, పోలీస్, దేవస్థానం, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు పాల్గొని వారి సలహాలు, సూచనలు అందజేశారు. భవిష్యత్తు అవసరాలను, ప్రధానంగా గిరి ప్రదక్షిణ, చందనోత్సవం వంటి పర్వదినాల్లో భక్తులు, వాహనాల రాకపోకలను పరిగణనలోకి తీసుకొని చర్యలు తీసుకోవాల్సి ఉందని అభిప్రాయపడ్డారు.

మౌలిక వసతుల కల్పనపై దృష్టి

దేవస్థానం ప్రతిపాదించిన ప్రత్యామ్నాయాల్లో అనుకూలమైన మార్గాన్ని చూపేందుకు, అధ్యయనం చేసేందుకు దేవస్థానం, పోలీసు, ఇంజనీరింగ్, ఆర్ అండ్ బీ, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులతో కూడిన కమిటీని నియమిస్తామని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కమిటీ అధ్యయనం తర్వాత అనుకూలమైన మార్గంలో రహదారిని నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు రహదారిని ఏర్పాటు చేయటంతో పాటు సింహాచలం దేవస్థానంపై మౌలిక వసతులను కూడా కల్పించాలని చెప్పారు. 25 నుంచి 30 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక చర్యలు తీసుకోవాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు. కొత్తగా నిర్మించబోయే రహదారికి ఆనుకొని కొండపై 5 ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులు కొండపై బస చేసేందుకు అనువుగా అదనపు వసతి గృహాలు నిర్మించాలని, కాటేజీలను అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్ షిప్ విధానంలో దేవస్థానం అవసరాలను తీర్చేలా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కొండపై ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఈవోను ఆదేశించారు. సుప్రభాత సేవ, ఆరాధన సమయంలో భక్తులు వచ్చేలా ఏర్పాట్లు చేయాలని, అన్ని రకాల సౌకర్యాలతో కూడిన సత్రాలను నిర్మించాలన్నారు. ఈ సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, ఈఈ శ్రీనివాస రాజు, డీసీపీ ఆనంద్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు ఇలా..

దేవస్థానం నుంచి కిందకు దిగేందుకు రెండు ప్రత్యామ్నాయాలను చూపుతూ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

- కొండపై ఉన్న టీవీ టవర్ నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డులో పాత గోశాల వైపు దిగేలా 6 కిలోమీటర్ల మేర ఒక రోడ్డును ప్రతిపాదించారు.
- కొండ పై భాగంలోని ఎత్తు రోడ్డు నుంచి 4.5 కిలోమీటర్ల మేర బీఆర్‌టీఎస్ రహదారిలో దిగేలా కృష్ణాపురం గోశాల(సూర్యనారాయణ దేవాలయం) వైపు మరో రహదారిని దేవస్థానం అధికారులు సూచించారు.
- తొలిపావంచ నుంచి ప్రస్తుతం ఉన్న రహదారిని దశావతారం జంక్షన్ నుంచి పైవరకు 2.5 కిలోమీటర్ల మేర విస్తరించేందుకు ప్రతిపాదన చేశారు.

బాధితులను ఆదుకుంటాం..



ఫిషింగ్ హార్బర్‌లో ప్రమాద సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు తదితరులు

- అధికార యంత్రాంగం స్పందన వల్ల ప్రమాద తీవ్రత తగ్గింది
- సీఎం మానవత దృక్పథంతో స్పందించారు
- వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

మహారాణిపేట : ప్రభుత్వం, అధికార యంత్రాంగం వెంటనే స్పందించడంతో ఫిషింగ్ హార్బర్‌లో ప్రమాద తీవ్రత తగ్గిందని వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. ఫిషింగ్ హార్బర్‌లో అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పోర్టు, స్టీల్‌ప్లాంట్, పోలీసులు సకాలంలో స్పందించారని, లేకుంటే భారీ ప్రమాదం సంభవించేదన్నారు. అధికారులు మంటలను అదుపు చేయడానికి ఎంతో కృషి చేశారని, దీని వల్ల ప్రాణ నష్టం జరగలేదన్నారు. మత్స్యకారుల పట్ల సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి మానవత దృక్పథంతో స్పందించారన్నారు. బాధితులకు 80 శాతం పరిహారం అందించాలని ఆదేశించారన్నారు. గతంలో మాదిరిగా ఆలస్యం కాకుండా రోజుల వ్యవధితో పరిహారం ఇస్తామన్నారు. మునిగిపోయిన బోట్లను తొలగించాలని పోర్టు అధికారులను కోరారు. మత్స్యకారుల సమస్యలు, కష్టాలను తెలుసుకోవాలని సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి తనను ఇక్కడకు పంపారని తెలిపారు. కేవలం పరిహారం మాత్రమే కాదు, ఇతర సమస్యలు తెలుసుకొని పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ఇప్పుడు కొంత మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారని, విచారణ జరుగుతోందన్నారు. సీసీ కెమెరాలు ఎందుకు పనిచేయలేదన్న విషయంపై విచారణ చేపట్టాలని సీపీని కోరారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా వై.వి.సుబ్బారెడ్డికి టోపీ, వల వైఎస్సార్ సీపీ నాయకుడు బర్రి కొండబాబు అందించారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, ఏపీ మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, ఏపీ క్రిస్టియన్ మైనార్టీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ, ఏపీ మరపడవల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్, వైఎస్సార్ సీపీ నాయకులు ద్రోణంరాజు శ్రీవత్సవ్, కార్పొరేటర్లు చెన్నా జానకీరామ్, వి.భాస్కరరావు, మత్స్యకార సంఘాల నాయకులు ఎ.దాసు, బర్రి కొండబాబు పాల్గొన్నారు.

తెరుకున్న హార్బర్

- చేపలు విక్రయాలు ప్రారంభం
- నేటి నుంచి యథావిధిగా కార్యకలాపాలు

మహారాణిపేట : ఫిషింగ్ హార్బర్ తెరుకుంది. ఆదివారం ఘోర అగ్ని ప్రమాదంలో భారీ స్థాయిలో ఆస్తి నష్టం సంభవించడంతో మత్స్యకారులంతా తీవ్ర ఆవేదనలో మునిగిపోయారు. సోమవారమంతా హార్బర్‌లో ఎటువంటి కార్యకలాపాలు జరగలేదు. మంగళవారం నుంచి ఒక్కొక్కరూ గంగమ్మతల్లిపై భారం వేసి పనుల్లో నిమగ్నమయ్యారు. యథావిధిగా కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. తెప్పలు, కొన్ని బోట్లు వేటకు వెళ్లి మత్స్య సంపదతో తిరిగొచ్చాయి. కొన్ని బోట్లలో నిల్వ ఉంచిన మత్స్యసంపదను మంగళవారం వేలంవేశారు. యథావిధిగా చేపల క్రయవిక్రయాలు జరిగాయి. హార్బర్‌ను నమ్ముకుని ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. బుధవారం రాత్రి నుంచి యథావిధిగా వేటకు వెళతామని రాష్ట్ర మరపడవల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ తెలిపారు.



ఎగుమతుల కోసం సిద్ధం చేస్తున్న ప్యాకింగ్ బాక్సులు

హార్బర్ ఘటనపై ప్రత్యేక బృందం ఏర్పాటు

డాబాగార్డెన్స్ : ఫిషింగ్ హార్బర్ అగ్ని ప్రమాద ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు వేగవంతం చేశారు. కేసును ఛేదించేందుకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటికే పది మంది అనుమానితులను స్టేషన్‌కు తీసుకొచ్చి విచారిస్తున్నట్టు సమాచారం. యూట్యూబర్ లోకల్ బాయ్ నాని ఇప్పటికీ పోలీసుల అదుపులో విచారిస్తున్నారు. అలాగే ప్రమాద సమయంలో ఆ ప్రాంతంలో సెల్‌టవర్ పరిధిలో గల మొబైల్స్ సమాచారాన్ని కూడా పరిశీలిస్తున్నట్టు తెలిసిందే. దీని ప్రకారం నిందితులను గుర్తించే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. ఇప్పటివరకు అదుపులోకి తీసుకున్న వారి నుంచి సేకరించిన సమాచారం మేరకు మరి కొంత మందిపై నిఘా పెట్టినట్టు భోగట్టా. ప్రమాదవశాత్తు ఘటన జరిగినట్టు కేసు నమోదు చేసినప్పటికీ.. ఇందులో కుట్ర వ్యవహారం దాగి ఉందన్న కోణంలో కూడా పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

బాధితులను ఆదుకోవాలని కేంద్రానికి ఎంపీ లేఖ

ఎంవీపీకాలనీ: ఫిషింగ్ హార్బర్‌లో జరిగి ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం జరిగిందని, బాధితులను ఆదుకోవాలని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కేంద్ర ప్రభుత్వానికి లేఖరాశారు. ప్రమాదంలో 44 లైసెన్స్‌డ్ బోట్లు దగ్ధమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ బాధితులకు భారీ సాయం అందించేందుకు ముందుకు వచ్చింది. 80 శాతం పరిహారం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. అయితే కేంద్ర ప్రభుత్వం కూడా బాధితులను ఆదుకోవాలని ఎంపీ కోరారు. ఈ మేరకు కేంద్ర మత్స్య, పశువర్ధక, పాడిపరిశ్రమల శాఖ మంత్రికి లేఖ రాసినట్లు తెలిపారు.

నేడు దక్షిణంలో సామాజిక సాధికార యాత్ర

విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు వై.వి.సుబ్బారెడ్డి పిలుపు

సాక్షి, విశాఖపట్నం: విశాఖ దక్షిణ నియోజకవర్గంలో బుధవారం జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ఎండాడలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన దక్షిణ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర బుధవారం దక్షిణ నియోజకవర్గంలో జరుగుతుందని, ఈ యాత్రను నాయకులందరూ కలిసి సమష్టిగా విజయవంతం చేయాలని కోరారు. డైమండ్ పార్కు జంక్షన్ దగ్గర ప్రారంభమై మనోరమ థియేటర్, రైతుబజార్, జగదాంబ, టౌన్ కొత్త రోడ్డు మీదుగా యాత్ర సాగుతుందని, అక్కడ జంక్షన్ వద్ద భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జి లేళ్ల అప్పిరెడ్డి, దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, నియోజకవర్గ పరిశీలకులు వీసం రామకృష్ణ, ఉపాధ్యక్షులు దామా సుబ్బారావు, కార్యాలయ పర్యవేక్షకుడు జి. రవిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయ్ కుమార్, ఎస్.ఎ. రెహమాన్, పిన్నింటి వరలక్ష్మి, క్రిస్టియన్ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్, కోశాధికారి ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నీలాపు వెంకటరమణారెడ్డి, దక్షిణ నియోజకవర్గ కార్పొరేటర్లు, ముఖ్య నాయుకులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర సాగనుందిలా..



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో గురువులు

- ఉదయం 11 గంటలకు డైమండ్ పార్క్ వద్ద సామాజిక సాధికార బస్సు యాత్రకు స్వాగతం
- 11.30 గంటలకు శ్రీకన్య ఫార్చ్యూన్‌లో ప్రెస్‌మీట్
- 12.30 గంటల నుంచి 2 గంటల వరకు భోజన విరామం
- మధ్యాహ్నం 2 గంటలకు రైల్వే న్యూకాలనీ సర్కిల్‌లో బస్సు యాత్రను ప్రారంభించనున్న పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- అచ్చియ్యమ్మపేట జీవీఎంసీ స్కూల్(నాడు-నేడు), వైఎస్సార్ అర్బన్ క్లినిక్(మనోరమ థియేటర్ వద్ద) సందర్శన
- రైల్వే న్యూకాలనీ, రైల్వేస్టేషన్ రోడ్డు, గోకుల్ థియేటర్, మనోరమ జంక్షన్, రామకృష్ణా రైతు మార్కెట్, దుర్గాలమ్మ గుడి జంక్షన్, సూర్యాబాగ్ మీదుగా జగదాంబ జంక్షన్ వరకు సాగనున్న యాత్ర. అక్కడ కూడలిలో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి మంత్రులు, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అనంతరం టర్నర్ చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, టౌన్ కొత్త రోడ్డు వద్ద గల బహిరంగ సభా ప్రాంగణం వరకు యాత్ర సాగనుంది.
- 3.15 గంటలకు టౌన్‌కొత్త రోడ్డు వద్ద బహిరంగ సభ ప్రారంభమై.. సాయంత్రం 5.15 గంటల వరకు జరగనుంది.
- యాత్రకు డిప్యూటీ సీఎంలు అంజాద్ భాష, బూడి ముత్యాలనాయుడు, స్పీకర్ తమ్మినేని సీతారాం, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, వేణుగోపాలకృష్ణ, సీదిరి అప్పలరాజు, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, కర్నూల్ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ తదితరులు హాజరుకానున్నారు.

దక్షిణంలో సామాజిక 'న్యాయం'

నాలుగున్నరేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని రంగాల్లోనూ సామాజిక న్యాయం పాటిస్తూ.. అందరికీ సమ న్యాయం చేశారు. విశాఖ దక్షిణ నియోజకవర్గం వరకు చూస్తే.. రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో 75 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అవకాశం కల్పించారు. వీరిలో 55 బీసీ, 17 ఎస్సీ, ముగ్గురు మైనారిటీలున్నారు. డీసీసీబీ చైర్మన్‌గా బీసీకి చెందిన కోలా గురువులు, జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్‌గా బీసీకి చెందిన కొండా రమాదేవి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా మధుసూదనరావు, క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా జాన్‌వెస్లీని నియమించారు. 12 మంది బీసీలను కార్పొరేషన్ల డైరెక్టర్లుగా, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఒకరికి కార్పొరేషన్ డైరెక్టర్‌గా, 8 మంది (7 బీసీలు, ఎస్సీ)కి ఆలయ కమిటీ చైర్మన్లుగా అవకాశం ఇచ్చారు. 41 మంది బీసీ, ఎస్సీ, మైనారిటీలకు ఆలయ కమిటీ సభ్యులుగా నామినేటెడ్ పదవులు కల్పించారు. బీసీ, ఎస్సీ, మైనార్టీలకు చెందిన 10 మంది కార్పొరేటర్లు దక్షిణం నుంచి ఎన్నికయ్యారు. ఇందులో ముగ్గురు ఎస్సీ, ఐదుగురు బీసీ, ఇద్దరు మైనారిటీ సామాజిక వర్గాలకు చెందిన వారు ఉన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి



దొండపర్తి: జిల్లాలో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సంబంధిత శాఖాధికారులను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. మంగళవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో హౌసింగ్, సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి జిల్లాలోని జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై వెబెక్స్ ద్వారా జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, హౌసింగ్ డీఈలు, ఏఈలు, జీవీఎంసీ జోనల్ కమిషనర్లు, అన్ని మండలాల ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించారు. పని ప్రారంభించిన ప్రతి ఇంటికి బ్యాంక్ ఖాతా తెరిచి ఆన్‌లైన్‌లో అప్డేట్ చేయాలని సూచించారు. పూర్తయిన ఇళ్లకు విద్యుత్ సరఫరా చేసి, ఆ వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఈపీడీసీఎల్ ఎస్ఈకు సూచించారు. గ్రామీణ నీటి సరఫరా అధికారులు కాలనీల్లో మంచినీటి కుళాయిల సౌకర్యం కల్పించాలన్నారు. కాలనీ ముఖ ద్వారా ఆర్చ్‌ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఏజెన్సీలకు సూచించారు. పనుల పూర్తికి అధికారులు క్షేత్ర స్థాయిలో నిత్యం పర్యటించాలన్నారు.

అందరికీ న్యాయం చేస్తాం..

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితులందరికి న్యాయం చేస్తామని కేంద్ర మంత్రి రూపాలా హామీ ఇచ్చారని బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు తెలిపారు. మంగళవారం హార్బర్‌లో అగ్ని ప్రమాద సంఘటన స్థలాన్ని ఆయన సందర్శించారు. అనంతరం బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రమాద విషయం కేంద్ర మంత్రి రూపాలా దృష్టికి తీసుకువెళ్లగా సంఘటన స్థలానికి వెళ్లి అన్ని వివరాలు తెలుసుకోమని తనతో ఇక్కడకు పంపించారన్నారు. బాధితులకు అండగా ఉంటామన్నారు. అనంతరం హార్బర్‌లో జరిగిన ప్రమాదంపై హార్బర్ ఏరియాలో ఉన్న సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ నాటికల్ అండ్ ఇంజనీరింగ్ ట్రైనింగ్ యూనిట్ అధికారులతో ఎంపీ జీవీఎల్ చర్చించారు. తర్వాత సిఫ్‌నెట్ కార్యాలయాన్ని సందర్శించి అక్కడ అధికారులతో పలు విషయాలు చర్చించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పి.వి.ఎన్.మాధవ్...



సంఘటన స్థలంలో ఎంపీ జీవీఎల్, తదితరులు

హెచ్ఎం, ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

తగరపువలస: భీమిలి 20వ వార్డు(పాత మున్సిపాలిటీ) ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులకు డీఈవో ఎల్.చంద్రకళ మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె తరగతుల నిర్వహణ, సిలబస్ పూర్తి చేయడంలో ఉపాధ్యాయుల నిర్లక్ష్యం, విద్యార్థుల వర్క్, నోట్ బుక్స్ దిద్దకపోడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈవో కార్యాలయానికి చేరువలో ఉన్న పాఠశాలలో లోపాలు కనిపించడం లేదా అంటూ సిబ్బందిని ప్రశ్నించారు. జీవీఎంసీ ఎంఎఫ్‌సీ యూపీ, మున్సిపల్ హైస్కూల్, 2వ వార్డు యూపీ స్కూల్, పండిట్ నెహ్రూ ప్రాథమిక పాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. అక్కడ కూడా తరగతుల నిర్వహణ, విద్యార్థుల వర్క్, నోట్ బుక్స్‌ను తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు.

అయ్యప్ప భక్తులకు స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం : కేరళ రాష్ట్రంలోని శబరిమలలో అయ్యప్పస్వామిని దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో విశాఖపట్నం – కొల్లాం – విశాఖపట్నం, శ్రీకాకుళం రోడ్ – కొల్లాం – శ్రీకాకుళం రోడ్ మధ్య పలు ప్రత్యేక రైళ్లు నడిపేందుకు నిర్ణయించినట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాల్తేర్ డివిజన్, డివిజినల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ కృషితో ఈ రెండు ప్రత్యేక రైళ్లు అందుబాటులోకి వచ్చాయని ఆయన తెలిపారు.

- శ్రీకాకుళం రోడ్ – కొల్లాం (08537) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ శ్రీకాకుళం రోడ్‌లో ప్రతీ శనివారం ఉదయం 11 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 1.42 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి 1.47 గంటలకు బయల్దేరి ఆదివారం సాయంత్రం 6 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు నవంబర్ 25 నుంచి జనవరి 27 వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కొల్లాం – శ్రీకాకుళం రోడ్ (08538) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ కొల్లాంలో ప్రతీ ఆదివారం రాత్రి 7.35 గంటలకు బయల్దేరి సోమవారం రాత్రి 11 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి 11.05 గంటలకు బయల్దేరి మంగళవారం తెల్లవారుజామున 2 గంటలకు శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు నవంబర్ 26 నుంచి జనవరి 28 వరకు నడుస్తుంది.
- విశాఖపట్నం – కొల్లాం (08539) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నంలో ప్రతీ బుధవారం ఉదయం 8.20 గంటలకు బయల్దేరి మరుసటిరోజు గురువారం మధ్యాహ్నం 12.55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. ఈ రైలు నవంబర్ 29 నుంచి జనవరి 31 వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కొల్లాం – విశాఖపట్నం (08540) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ కొల్లాంలో ప్రతీ గురువారం రాత్రి 7.35 గంటలకు బయల్దేరి మరుసటిరోజు శుక్రవారం రాత్రి 11.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైలు నవంబరు 30 నుంచి ఫిబ్రవరి 1 వరకు నడుస్తుంది.

హాల్‌టికెట్లు సిద్ధం

విశాఖ విద్య: జాతీయ ఉపకార వేతన పరీక్ష(ఎన్ఎంఎంఎస్) పరీక్ష డిసెంబర్ 3న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరుగుతుందని డీఈవో చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరవుతున్న విద్యార్థుల హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. www.bsc.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో పాఠశాలయు-డైస్ కోడ్ ఉపయోగించి ప్రధానోపాధ్యాయులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసి, విద్యార్థులకు అందజేయాలని పేర్కొన్నారు.

విశాఖ చేరుకున్న మరికొందరు



విశాఖ విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్

గోపాలపట్నం: ఇండియా, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఈ నెల 23న జరిగే టీ–20 మ్యాచ్ కోసం పలువురు క్రికెటర్లు మంగళవారం విశాఖ చేరుకున్నారు. ఇప్పటికే కొంత ఆస్ట్రేలియా, ఇండియా క్రికెటర్లు రాగా.. మంగళవారం మరికొందరు వచ్చారు. చెన్నై నుంచి ఇండిగో విమానంలో ఆస్ట్రేలియా జట్టు సభ్యులు రాగా.. హైదరాబాద్ నుంచి కొందరు భారత క్రికెటర్లు విశాఖ చేరుకున్నారు. భారత జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ముంబాయి నుంచి ఇండిగో విమానంలో వచ్చాడు. వీరంతా విమానాశ్రయం నుంచి రుషికొండలోని రాడిషన్ బ్లూ హోటల్‌కు ప్రత్యేక బస్సుల్లో వెళ్లారు.



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న ఆస్ట్రేలియా జట్టు సభ్యులు

నెట్స్‌లో చెమటోడ్చారు

సాధన చేసిన భారత్, ఆస్ట్రేలియా క్రికెటర్లు

విశాఖ స్పోర్ట్స్: టీ–20 సిరీస్‌లో భాగంగా విశాఖ వేదికగా తొలి మ్యాచ్ ఆడనున్న భారత్, ఆస్ట్రేలియా జట్లు మంగళవారం వైఎస్సార్ స్టేడియంలో సాధన చేశాయి. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి నాలుగు వరకు భారత్ జట్టు.. ఐదు నుంచి ఎనిమిది గంటల వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ఆస్ట్రేలియా జట్టు ప్రాక్టీస్ చేసింది. గురువారం రాత్రి ఏడు గంటలకు మ్యాచ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగానే మాథ్యూ వేడ్ సారథ్యంలో ఆ జట్టు శ్రమించింది. ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్‌తో పాటు వరల్డ్‌కప్ ఆడిన మిచెల్ మార్ష్, జోస్ హేజెల్‌వుడ్, కామెరాన్ గ్రీన్, మిచెల్ స్టార్క్ విశ్రాంతి తీసుకోవడంతో.. వీరి ఆటను ప్రత్యక్షంగా చూడాలనుకున్న విశాఖ అభిమానులకు నిరాశే ఎదురైంది. అంతర్జాతీయ వేదికపై తొలిసారిగా ఆడేందుకు ఆస్ట్రేలియా ఆటగాళ్లు జాసన్, టిమ్, నాథన్, జాన్సన్, షార్ట్, స్టోయినిష్ ఇప్పటికే విశాఖ చేరుకుని ప్రాక్టీస్ చేశారు. విశాఖ పిచ్‌పై అనుభవం ఉన్న డేవిడ్ వార్నర్‌ను బోర్డ్ చివరి నిమిషంలో వెనక్కి పిలవడంతో మరోసారి అతని ఆటను అభిమానులు మిస్ అయ్యారు. అతని స్థానంలో ఆల్‌రౌండర్ హార్డీ రానున్నాడు. స్టీవ్ స్మిత్, వరల్డ్ కప్ ఫైనల్స్ సెంచరీ హీరో ట్రావిస్ హెడ్, గ్లెన్ మాక్స్‌వెల్, మార్కస్, జంపా, జోష్, అబాట్‌తో పాటు రిజర్వ్ ఆటగాడు తన్వీర్ నెట్స్‌లో చెమటోడ్చాడు. ఇక భారత్ తరఫున ఆసియా కప్‌తో పాటు ఐర్లాండ్‌తో మ్యాచ్‌లాడిన ఆటగాళ్లే విశాఖలో ఆడనున్నారు. ఐర్లాండ్‌తో ఆడిన భారత్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన బుమ్రాకు విశ్రాంతినిచ్చి.. సూర్యకుమార్ యాదవ్‌కు జట్టు సారథ్య బాధ్యతలు అప్పగించారు. రుతురాజ్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా వికెట్ల వెనుక జితేశ్ నిలవనున్నాడు. శ్రేయాస్‌ను జట్టుకు ఎంపిక చేసినా.. విశాఖలో మ్యాచ్‌కు విశ్రాంతి తీసుకుంటుండంతో ప్రాక్టీస్‌కు రాలేదు. ప్రపంచ కప్‌కు ఎంపికైన ఇషాన్ కిషాన్, ప్రసిద్ధ్ కృష్ణ విశాఖలో ఆడనున్నారు. యశస్వి, తిలక్, రింకూ, శివం, అర్ష్‌దీప్, సుందర్, రవి బిష్ణోయ్‌లు మంగళవారం ప్రాక్టీస్ చేశారు. తొలిసారిగా భారత్ జట్టుకు కోచ్‌గా సేవలందిస్తున్న వి.వి.ఎస్.లక్ష్మణ్ పర్యవేక్షణలో విశాఖ వేదికగా ఇండియా శుభారంభం చేస్తుందని అభిమానులు ఆశగా ఎదురు చూస్తున్నారు.





సాధన చేస్తున్న భారత్ బౌలర్, పిచ్‌ను పరిశీలిస్తున్న కోచ్ లక్ష్మణ్



భారత బ్యాటర్ల మాటామంతీ





ముమ్మరంగా సాధన చేస్తున్న ఆస్ట్రేలియా క్రికెటర్లు

టీ-20కి సర్వం సిద్ధం



మ్యాచ్ నిర్వహణ ఏర్పాట్లను వివరిస్తున్న కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున, చిత్రంలో సీపీ రవిశంకర్, కమిషనర్ సాయికాంత్

కలెక్టర్ మల్లికార్జున

విశాఖ స్పోర్ట్స్: టీ–20 సిరీస్‌లో భాగంగా భారత్‌తో ఆస్ట్రేలియా తలపడే తొలి మ్యాచ్‌కు విశాఖలోని వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియం సిద్ధమైంది. గురువారం రాత్రి 7 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా స్టేడియంలో మంగళవారం నిర్వాహక కమిటీ సమావేశమైంది. కమిటీ అధ్యక్షుడు, కలెక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ మ్యాచ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అవసరమైన చర్యలు తీసుకున్నట్లు వివరించారు. నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ మాట్లాడుతూ ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా మళ్లింపు కోసం డీఎస్పీ స్థాయి అధికారులను నియమించామన్నారు. ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ స్టేడియంను సుందరంగా తీర్చిదిద్దామన్నారు. స్టేడియంలో కొన్ని గ్యాలరీల్లో కుర్చీలను మార్పు చేసి అభిమానులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. కార్పొరేట్ గ్యాలరీని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్ది.. ప్రత్యేక మార్గాన్ని ఏర్పాటు చేశామన్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ మాట్లాడుతూ స్టేడియంలో పారిశుధ్యం నిర్వహణ, ఫుడ్‌స్టాళ్లు, మంచినీటి సౌకర్యం కల్పించామన్నారు. డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ ఆరు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచామన్నారు. మ్యాచ్ నిర్వాహక కమిటీ, వీడీసీఏ ప్రతినిధులతో పాటు సీఈవో శివారెడ్డి పాల్గొన్నారు.

- 2 వేల మంది పోలీసులతో పటిష్ట భద్రత చర్యలు
- ఆటగాళ్లు బస, ప్రయాణించే ప్రాంతాల్లో నిరంతర తనిఖీలు
- ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు

భారీ బందోబస్తు

దొండపర్తి: భారత్–ఆస్ట్రేలియా క్రికెట్ జట్ల మధ్య ఈ నెల 23న వైఎస్సార్ స్టేడియంలో జరిగే టీ–20 మ్యాచ్‌కు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు రెండు వేల మందితో పటిష్ట భద్రత చర్యలు చేపడుతున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి క్రీడాకారులు బయలుదేరే ప్రాంతాల్లోనే కాకుండా.. వారు బస చేసే హోటళ్ల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నారు. స్టేడియం చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. స్టేడియంలోకి వెళ్లే అన్ని గేట్ల వద్ద ఏసీపీ స్థాయి అధికారులను నియమించారు. స్టేడియం వద్ద మూడంచెల భద్రతతో పలు సెక్టార్లుగా విభజించారు. స్టేడియం లోపల, బయట, చుట్టూ ఉన్న బహుళ అంతస్తులపైనా పూర్తి భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. మ్యాచ్ సందర్భంగా ఎక్కడా ట్రాఫిక్ నిలిచిపోకుండా ప్రణాళికలు సిద్ధం చేశారు.

పోలీసుల సూచనలివీ..

- అనేక ప్రత్యేకతలతో టికెట్ డిజైన్ చేశారు. లెవల్–1లో టికెట్‌ను హాఫ్ ఇంచ్ చింపితే ఆకు పచ్చ రంగు కనిపిస్తుంది. టికెట్‌ను సమాంతరంగా పెట్టి చూస్తే గోల్డ్ కలర్ సెక్యూరిటీ థ్రెడ్ కనిపిస్తుంది. టికెట్‌పై బార్‌కోడ్ స్కాన్ చేస్తే మ్యూజిక్ వస్తుంది. అలా ఉంటేనే ఒరిజినల్ టికెట్‌గా పరిగణిస్తారు.
- కొంతమంది కలర్ జిరాక్స్ తీసిన టికెట్లను అమ్మి మోసగిస్తారు. అటువంటి గుర్తు తెలియని వ్యక్తుల వద్ద కలర్ జిరాక్స్ టికెట్లను కొని మోసపోవద్దు.
- బయట నుంచి ఆహార పదార్థాలు, వాటర్ బాటిళ్లను అనుమతించరు. స్టేడియంలోనే ఇవి అందుబాటులో ఉంటాయి.
- స్టేడియం మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటుంది. ప్రేక్షకులు ఎవరైనా ఎటువంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడినా.. పరిధి దాటి ఆటగాళ్లతో సెల్ఫీలు తీసుకున్నా.. ప్రయత్నించినా కఠిన చర్యలు తప్పవు.
- సాయంత్రం 7 నుంచి రాత్రి 11 వరకు క్రికెట్ మ్యాచ్ ఉంటుంది. ప్రేక్షకులను సాయంత్రం 4 లేదా 5 గంటల నుంచి స్టేడియంలోకి అనుమతిస్తారు.

ట్రాఫిక్, పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు

టీ–20 మ్యాచ్ సందర్భంగా స్టేడియానికి 28 వేల మంది వచ్చే అవకాశముంది. వేల సంఖ్యలో వాహనాలపై వారు వచ్చే అవకాశం ఉండటంతో.. అందుకు తగ్గట్టుగా పోలీసులు ట్రాఫిక్, పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు.

- మ్యాచ్‌తో సంబంధం లేని వాహనచోదకులు క్రికెట్ స్టేడియం వైపు నుంచి కాకుండా.. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించాలి.
- శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం వైపు నుంచి నగరంలోకి వచ్చే బస్సులు, ఇతర కమర్షియల్ వాహనాలు మారికవలస వద్ద ఎడమ వైపునకు తిరిగి.. జురాంగ్ జంక్షన్ మీదుగా తిమ్మాపురం చేరుకోవాలి. కుడి వైపున బీచ్ రోడ్డులో ప్రయాణించి రుషికొండ, సాగర్ నగర్, జోడుగుళ్లపాలెం మీదుగా వెళ్లాలని పోలీసులు సూచించారు.
- శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం వైపు నుంచి వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు వంటివి కార్ షెడ్ నుంచి మిథిలాపురి కాలనీ మీదుగా.. ఎంవీపీ సిటీ వెనుకగా వెళ్లాలి. అక్కడి నుంచి లా కాలేజీ రోడ్డు మీదుగా ఎన్‌హెచ్ 16కు చేరుకుని నగరానికి చేరుకోవాలి. లా కాలేజీ రోడ్డు నుంచి పనోరమ హిల్స్, రుషికొండ మీదుగా కూడా నగరంలోకి వెళ్లవచ్చు.
- నగరం నుంచి ఆనందపురం, విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే బస్సులు, ఇతర కమర్షియల్ వాహనాలు, హనుమంతవాక నుంచి ఎడమ వైపు తిరిగి.. ఆరిలోవ బీఆర్‌టీఎస్ రోడ్డులో వెళ్లి అడివివరం వద్ద కుడి వైపు తిరిగి ఆనందపురం మీదుగా వెళ్లాలి.
- నగరం నుంచి ఆనందపురం, విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు హనుమంతవాక జంక్షన్ నుంచి ఎడమ వైపు తిరిగి.. అడివివరం మీదుగా ఆనందపురం వెళ్లొచ్చు. లేదా హనుమంతవాక జంక్షన్ లేదా విశాఖ వ్యాలీ జంక్షన్ లేదా ఎండాడ జంక్షన్ వద్ద కుడి వైపు తిరిగి బీచ్ రోడ్డుకు చేరుకుని.. తిమ్మాపురం వద్ద ఎడమ వైపు తిరిగి మారికవలస వద్ద ఎన్‌హెచ్ 16కు చేరుకోవచ్చు.

భారీ వాహనదారులకు సూచనలు

- 23వ తేదీ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 12 వరకు ఎటువంటి భారీ వాహనాలు స్టేడియం వైపు అనుమతించరు.
- అనకాపల్లి నుంచి విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే వాహనాలు నగరంలోకి రాకుండా సబ్బవరం, పెందుర్తి, ఆనందపురం మీదుగా వెళ్లాలి.
- శ్రీకాకుళం, విజయనగరం వైపు నుంచి అనకాపల్లి వైపు వెళ్లే వాహనాలు నగరంలోకి రాకుండా ఆనందపురం నుంచి పెందుర్తి, సబ్బవరం మీదుగా అనకాపల్లి వైపు వెళ్లాలి.
- నగరం నుంచి బయలుదేరి విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే భారీ వాహనాలు అన్నీ అనకాపల్లి వైపుగా సబ్బవరం, పెందుర్తి, ఆనందపురం మీదుగా ప్రయాణించాలి.
- శ్రీకాకుళం, విజయనగరం వైపు నుంచి నగరంలోకి వచ్చే భారీ వాహనాలన్నీ ఆనందపురం నుంచి పెందుర్తి, సబ్బవరం, అనకాపల్లి మీదుగా నగరంలోకి చేరుకోవాలి.

మ్యాచ్ వీక్షించడానికి వచ్చే వాహనచోదకులకు సూచనలు

- నగరం నుంచి స్టేడియానికి వచ్చే వీవీఐపీ, వీఐపీ వాహనచోదకులు ఎన్‌హెచ్16లో స్టేడియం వరకు ప్రయాణించి.. ఏ గ్రౌండ్, బీ గ్రౌండ్, వి కన్వెన్షన్ గ్రౌండ్‌లలో వారి వారి పాస్‌ల ప్రకారం చేరుకోవాలి.
- విశాఖ వైపు నుంచి స్టేడియానికి వచ్చే టికెట్ ఉన్న వారు ఎన్‌హెచ్16లో ప్రయాణించి.. స్టేడియం సమీపంలోని ఓల్డేజ్ జంక్షన్ వద్ద ఎడమ వైపు తిరిగి సాంకేతిక ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో పార్కింగ్ చేసుకోవాలి. అక్కడే ఆన్‌లైన్ టికెట్లను ఒరిజినల్ టికెట్లుగా మార్చుకునేందుకు కౌంటర్లు ఏర్పాటు చేశారు.
- శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం, గంభీరం, బోయపాలెం, కొమ్మాది వైపు నుంచి వచ్చే వారు కార్‌షెడ్ జంక్షన్ వద్ద కుడి వైపు తిరిగి సాంకేతిక ఇంజినీరింగ్ కాలేజీ పార్కింగ్ గ్రౌండ్‌కు చేరుకోవాలి. లేదా కార్ షెడ్ జంక్షన్ నుంచి ఎడమ వైపు తిరిగి మిథిలాపురి కాలనీ మీదుగా వచ్చి, ఎంవీపీ సిటీ డబుల్ రోడ్డు, పోలిశెట్టి వేణుగోపాలరావు గ్రౌండ్‌లలో పార్కింగ్ చేసుకోవాలి.
- నగరం నుంచి లేదా భీమిలి వైపు నుంచి బీచ్ రోడ్డు మీదుగా స్టేడియానికి వచ్చే వారు.. ఐటీ సెజ్ మీదుగా మీదుగా వచ్చి ఎంవీపీ సిటీ డబుల్ రోడ్డులో వాహనాలు నిలపాలి.
- నగరం నుంచి వచ్చే ఆర్టీసీ స్పెషల్ బస్సులు ఎన్‌హెచ్-16లో రాకుండా బీచ్‌రోడ్డులో వచ్చి ఐటీ సెజ్ మీదుగా లా కాలేజీ రోడ్డులో పార్కింగ్ చేసుకోవాలి.
- శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం వైపు నుంచి వచ్చే ఆర్టీసీ స్పెషల్ బస్సులు మారికవలస, తిమ్మాపురం, ఐటీ సెజ్ మీదుగా లా కాలేజీ రోడ్డుకు చేరుకుని వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి.

క్రీడాభివృద్ధికి సీఎం జగన్ కృషి

ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లోనూ క్రీడలను అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి వుడా మైదానంలో రాష్ట్ర స్థాయి అండర్ – 14 బాల, బాలికల ఫుట్‌బాల్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలతో పాటు అన్ని గ్రామాల్లో క్రీడల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. తద్వారా విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారని, దానికి తగిన విధంగా పోటీలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులను వైఎస్సార్ గ్రామీణ పురస్కారాల పేరుతో ప్రోత్సహిస్తున్నామన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గతంలో ఎవరూ చేయని విధంగా ఇప్పటికే రూ.25 వేల కోట్లు సీఎం జగన్ కేటాయించారని పేర్కొన్నారు. విద్యార్థులు గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తితో ఆడాలని కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎం.వెంకటరావు, కార్యదర్శి చినబాబు, జిల్లా పీఈటీ సంఘం కార్యదర్శి ఎం.లలిత్‌కుమార్, కార్పొరేటర్లు గంటా అప్పలకొండ, దౌలిపల్లి కొండబాబు, జీవీఎంసీ కో ఆప్షన్ మెంబర్ కొప్పల ప్రభావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



బెలూన్లు ఎగురవేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఈఎన్‌సీ ఉద్యోగులకు ట్రోఫీలు

దొండపర్తి : తూర్పు నావికాదళంలో వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన అధికారులు, సిబ్బందికి ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ ట్రోఫీలను బహూకరించారు. మంగళవారం ఈఎన్‌సీ ప్రధాన కార్యాలయంలో అర్ధ సంవత్సర కమాండ్ స్టాఫ్ సమావేశం నిర్వహించారు. ఈఎన్‌సీ వైస్ అడ్మిరల్ అధ్యక్షతన నావికాదళం భద్రత, రక్షణ, ఇతర కార్యనిర్వాహక కార్యకలాపాలపై సమీక్షించారు. 2022–23లో విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి పూర్వీ నౌసేనా కమాన్ రాజ్‌భాషా, సీ–ఇన్–సీ వీల్ అండ్ వైజాగ్ స్టేషన్ స్పోర్ట్స్, బెస్ట్ ఎన్విరాన్‌మెంట్–ఫ్రెండ్లీ యూనిట్ ట్రోఫీలను వైస్ అడ్మిరల్ అందజేశారు. క్వాలిటీ, క్విక్ రియాక్షన్ టీమ్, ఇన్నోవేషన్ ఇతర విభాగాల్లో రాణిస్తున్న వారికి చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్‌సక్సేనా అవార్డులను బహూకరించారు.



ట్రోఫీలు అందజేస్తున్న ఈఎన్‌సీ చీఫ్ వైస్‌అడ్మిరల్

కోస్ట్‌గార్డ్ రీజియన్ కమాండర్ బాధ్యతల స్వీకరణ

సింధియా : చెన్నైలోని కోస్ట్‌గార్డ్ ఎయిర్‌స్టేషన్‌లో నిర్వహించిన ఉత్సవ కవాతులో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆనంద్ ప్రకాష్ బడోలా నుంచి ఈస్ట్రన్ కోస్‌గార్డ్ రీజియన్ కమాండర్‌గా ఇన్‌స్పెక్టర్ జనరల్ డోనీ మైఖేల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఆనంద్ ప్రకాష్ బడోలా రెండున్నరేళ్ల కాలం తర్వాత న్యూఢిల్లీని కోస్ట్‌గార్డ్ హెడ్‌క్వార్టర్స్‌కు డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా శాశ్వత బదిలీపై వెళ్తున్నారు. కొత్త రీజినల్ కమాండర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్ జనరల్ డోనీ మైఖేల్ చెన్నైలోని లయోలా కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి 1990 జూలై 6న ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో చేరారు. ఎన్‌డీ స్కూల్ కొచ్చి నుంచి నావిగేషన్ అండ్ డైరెక్షన్‌లో స్పెషలిస్ట్ కోర్సు పూర్తి చేసి, ఇండియన్ నేవల్ అకాడమీలో అకడమిక్ ఎక్సలెన్స్‌లో అనేక అవార్డులు గెలుచుకున్నారు. 2011లో ఢిల్లీలోని విశ్వవిద్యాలయంలో న్యాయవిద్యను పూర్తి చేసి ఎల్ఎల్‌బీ డిగ్రీ పొందారు.

ఘనంగా ప్రపంచ మత్స్య దినోత్సవం

బీచ్ రోడ్డు: ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని మంగళవారం ఐసీఏఆర్–సీఐఎఫ్‌టీ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను ఐసీఏఆర్–సీఐఎఫ్‌టీ ఇన్‌చార్జి సైంటిస్ట్ డాక్టర్ యు.శ్రీధర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆక్వా కల్చర్‌లో కీలక సవాళ్లను పరిష్కరించే పరిశోధనను ప్రోత్సహించడంలో తమ సంస్థ అంకిత భావంతో పని చేస్తుందన్నారు. మత్స్య సంపద, వాతావరణ మార్పు ప్రభావాలు, ఓవర్ ఫిషింగ్, సాంకేతికతతో సహా నీటి పర్యావరణ వ్యవస్థలను సంరక్షిస్తూ ఉత్పాదకతను పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. మత్స్య పరిశ్రమలో స్థిరమైన ఫిషింగ్ పద్ధతులు, సాంకేతిక పురోగతిపై వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జెస్మీ డెబ్బర్మ, ప్రిన్సిపల్ సైంటిస్టులు డాక్టర్ ఆర్.రఘు ప్రకాష్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ బి.మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీధర్

ప్రైవేట్ స్కూళ్ల గుర్తింపు ఎనిమిదేళ్లకు పెంపు



మాట్లాడుతున్న కృష్ణా రెడ్డి

విశాఖ విద్య: ప్రైవేటు స్కూళ్ల గుర్తింపును మూడేళ్ల నుంచి ఎనిమిదేళ్లకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటంపై విశాఖ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(అపుస్మా) హర్షం వ్యక్తం చేసింది. మంగళవారం ఎస్‌పీడీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అపుస్మా చీఫ్ మెంటర్ ఎ.కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సుంకర శ్రీనివాసరావు, ఎంవీవీ సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల మనోభావాలను గుర్తించి, సానుకూలమైన నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి గుర్తింపు/రెన్యువల్ విషయంలో ఆన్‌లైన్ విధానం కాకుండా ఆఫ్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించటంతో మరింత మేలు జరిగిందన్నారు. ఇందుకు కృషి చేసిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీలు టి.కల్పలతరెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి ఎం.వి.రావు, నాయకులు శేషగిరిరావు, సురేష్‌కుమార్, శంకరరావునాయుడు, పరశురామ్, భాస్కరరావు, ప్రసాద్, రత్నం, గీత, ఉషా, రవికృష్ణ పాల్గొన్నారు.

విశాఖ బాస్కెట్‌బాల్ జట్టు సత్తా

విశాఖ స్పోర్ట్స్: ఏపీ అంతర జిల్లాల బాస్కెట్‌బాల్ టోర్నీలో విశాఖ మెన్ జట్టు విజేతగా నిలిచింది. మహిళల జట్టు రన్నరప్‌గా నిలిచింది. గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈ పోటీలు మూడు రోజుల పాటు జరిగాయి. ఈ టోర్నీలో 18 జిల్లాల జట్లు పోటీపడ్డాయి. ఈ సందర్భంగా మెన్, వుమెన్ జట్లను జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ప్రతినిధులు అభినందించారు.

ఆస్తిపన్ను చెల్లించలేదని ప్రైవేట్ కళాశాల కార్యాలయం సీజ్

గాజువాక : ఆస్తిపన్ను బకాయిలు చెల్లించడంలేదనే కారణంతో 72వ వార్డు చైతన్యనగర్‌లోని ఒక అద్దె భవనంలో నిర్వహిస్తున్న ప్రైవేట్ కళాశాల కార్యాలయాన్ని జీవీఎంసీ రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. అద్దె భవన యజమాని రూ.6.58 లక్షల పన్ను బకాయిలను చెల్లించాల్సి ఉందని, దీనిపై పలుమార్లు డిమాండ్ నోటీసులు జారీ చేసినా సంబంధిత వ్యక్తి స్పందించకపోవడంతో ఈ చర్య చేపట్టినట్లు జీవీఎంసీ డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సీహెచ్.సత్యనారాయణ తెలిపారు. జోనల్ రెవెన్యూ అధికారులు రామనారాయణ, శ్రీకాంత్, ఆర్ఐలు రెడ్డి మోహన్, సుభాన్ తదితరులతో కలిసి ఆ భవనంలోగల కళాశాల కార్యాలయాన్ని సీజ్ చేశారు.

ఫైనల్‌కు వుమెన్ -19జట్టు

విశాఖ స్పోర్ట్స్ : వుమెన్ అండర్ 19 టీ20 టోర్నీ ఫైనల్‌కు ఆంధ్ర మహిళా జట్టు చేరుకుంది. మంగళవారం జరిగిన పోటీలో మహారాష్ట్రపై ఆంధ్ర టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసి నాలుగు వికెట్లకు 149 పరుగులు చేసింది. రామలక్ష్మి 89పరుగులతో రాణించింది. ప్రతిగా మహారాష్ట్ర జట్టు ఏడు వికెట్లు కోల్పోయి 146 పరుగులే చేసింది. ఓపెనర్ బహాచారి 79 పరుగులు చేసింది. బౌలింగ్‌లోనూ రామలక్ష్మి రాణించి మూడు వికెట్లు తీసి ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరిచింది.

రేపు కబడ్డీ జట్టు ఎంపిక

పెదగంట్యాడ: ఉమ్మడి విశాఖ జిల్లా మహిళా కబడ్డీ జట్ల ఎంపికలను ఈ నెల 23న మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నామని విశాఖపట్నం జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జె.ఎస్.వి.ప్రసాద్‌రెడ్డి తెలిపారు. బీసీ రోడ్డులోని మార్వెల్ స్కూల్ ఎదురుగా గల కబడ్డీ గ్రౌండ్స్‌లో ఈ ఎంపికలు ఉంటాయన్నారు. 75 కిలోల లోపు బరువు గల వారు అర్హులన్నారు. ఇక్కడ ఎంపిక చేసిన క్రీడాకారులను ఈ నెల 29 నుంచి వచ్చే నెల 1 వరకూ కర్నూలు జిల్లా గోనెగండ్లలో నిర్వహించనున్న 70వ ఆంధ్ర రాష్ట్ర కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9666655355లో సంప్రదించాలని సూచించారు.

సకాలంలో టీడీఎస్ దాఖలు చేయాలి

దొండపర్తి : త్రైమాసిక టీడీఎస్ స్టేట్‌మెంట్లను సకాలంలో దాఖలు చేయాలని ఆదాయపన్ను శాఖ డిప్యూటీ కమిషనర్ వై.విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఉదయం దసపల్లా హోటల్‌లో నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సభ్యులకు టీడీఎస్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశ నిర్మాణంలో టీడీఎస్ ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ఆదాయ పన్ను అధికారి(టీడీఎస్) ఎం.నవీన్ కుమార్ ఒప్పందం ప్రకారం చెల్లింపు, కాంట్రాక్టర్లకు చెల్లింపులకు సంబంధించి విషయాలను విశదీకరించారు. ఆదాయ పన్ను అధికారి(టీడీఎస్) జి.రవిశంకర్ సకాలంలో టీడీఎస్ ప్రభుత్వ ఖాతాకు జమ చేయాలని సూచించారు. నెరెడ్కో విశాఖ అధ్యక్షుడు సిహెచ్.నాగ్ కుమార్ మాట్లాడుతూ టీడీఎస్ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు.